క్లుప్తంగా

ఈశ్వరసాయి ట్రస్ట్ సేవలు ఎనలేనివి



ఫిరంగిపురం: చిట్టా ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు ఎనలేనివని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. మండలంలోని రేపూడి గ్రామంలోని బాపూజీరెడ్డి గృహంలో చిట్టా ఈశ్వరసాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యవృత్తిని అభ్యసిస్తూ మృతిచెందిన ఈశ్వరసాయి పదకొండేళ్లు గడుస్తున్నా వైద్యంపై ఆమెకు ఉన్న మమకారాన్ని గుర్తుచేసుకొని ఆమె తండ్రి బాపూజీరెడ్డి ప్రతి ఏటా ఉచిత వైద్యశిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ఆమె ఆశయసాధనలో భాగంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని అభినందించారు. ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, చిట్టా విజయభాస్కరరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, షేక్ సలీం, ట్రస్ట్ చైర్మన్ చిట్టా భరద్వాజ్‌రెడ్డి, కె.అప్పిరెడ్డి, కె.రామారావు, ఇ.శ్రీనివాసరెడ్డి, చౌదయ్య, ఇజ్రాయిల్, మస్తాన్‌వలి, ఎస్.నాగరాజు, రాయప్ప, ఆశీర్వాదం, సత్తార్, కృష్ణజాలరెడ్డి, ఎస్.శివారెడ్డి, శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

ఏఐసీసీ సెక్రటరీ, ఏపీ ఇన్‌చార్జి మాణిక్యం ఠాక్రే



తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందని ఏఐసీసీ సెక్రటరీ, ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాక్రే అన్నారు. గురువారం ఒంగోలు వెళ్తున్న ఆయన మంగళగిరి పట్టణ పరిధిలోని తెనాలి ఫ్లై ఓవర్ వద్ద జాతీయ రహదారిపై కొద్దిసేపు ఆగారు. ఈక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తాయి ఉదీర్ ఘనస్వాగతం పలికారు. మాణిక్యం ఠాక్రే మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారని, ఏపీలో కూడా కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కిరాజు రామారావు, యూత్ కాంగ్రెస్ నాయకులు గోపికృష్ణ సాయి, మణి, దేవేందర్, పవన్, సురేష్, శివర్ధన్, శివకృష్ణ, ప్రదీప్ ఉన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో ముగిసిన క్రీడోత్సవాలు



తాడేపల్లిరూరల్: మంగళగిరి మండలం ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ క్రీడోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములు రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు విద్యార్థుల మానసిక ఉల్లాసం పెంపొందించడంకోసం క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రన్నింగ్, క్రికెట్, పుస్తక అన్వేషణ, త్రోబాల్, షటిల్, క్యారమ్స్, క్విజ్, షాట్‌పుట్ తదితర క్రీడలను నిర్వహించామని విజేతలకు బహుమతి ప్రదానం చేశామని తెలిపారు. ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీని అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి సీఐ వాసు, కళాశాల కార్యదర్శి నిర్మలా జ్యోతి, కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ శౌరి, క్రీడా పోటీల సమన్వయకర్తలు డాక్టర్ వినయ్‌కుమార్, పి.జోజిబాబు, డాక్టర్ సౌజన్య, రత్నమంజుల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



తెనాలిరూరల్: తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో కొమ్మమూరు కాల్వలో గల్లంతైన యువకుడి మృతదేహం లభించింది. గుంటూరు నగరంలో ఏటుకూరు రోడ్డులోని దర్గా మాన్యంకు చెందిన కొలూరి నాని(18) తన తమ్ముడు, మరో ఇద్దరు స్నేహితులతో కలసి సరదాగా ఈత కొట్టేందుకు సంగంజాగర్లమూడి సంగమేశ్వరస్వామి దేవస్థానం వద్దకు బుధవారం వెళ్లి కాల్వలోకి దిగి నీటి ప్రవాహానికి గల్లంతైన సంగతి తెలిసిందే. యువకుడి ఆచూకీ కోసం పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గురువారం గాలింపు చేపట్టగా సంగంజాగర్లమూడి లాకుల వద్ద మృతదేహాన్ని కాల్వలో గుర్తించారు. మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

క్రీడల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

- ఎన్నడూ లేనివిధంగా క్రీడాకారుల కోసం 'ఆడుదాం ఆంధ్రా'
- మన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడాలన్నదే సీఎం జగన్ సంకల్పం
- ఎమ్మెల్సీ మురుగుడు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి



వాలీబాల్ ఆడుతున్న గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్: పేద ప్రజలు అన్నివిధాలా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని మాజీ మంత్రి, ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి అన్నారు. గురువారం దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవిలు జాతీయ జెండాను ఆవిష్కరించి క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత పేద ప్రజల భవిష్యత్తు కోసమే నిరంతరం పనిచేస్తున్నారని, ఏ ప్రభుత్వాలు తీసుకోని మంచి నిర్ణయాలు తీసుకుని పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. గ్రామ, వార్డు స్థాయిల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వాడవాడలా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆటల పోటీలు నిర్వహించేందుకు రూ.125 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. 5 స్థాయిలో జరిగే ఈ ఆటల పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి యువకులు ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను చాటుతున్నారని, కోచింగ్ తీసుకుని క్రికెట్ ఆడుతున్న యువతను చూశామని, మన గ్రామాల్లో, మన పట్టణాల్లో ఉన్న యువత క్రికెట్ చాలా బాగా ఆడుతున్నారని, వాటితో పాటు కబడ్డీ, వాలీబాల్, బాడ్మింట్ పోటీల్లో యువకులు పోటీ పడుతున్నారని, గ్రామస్థాయిలో ఉన్న క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడేందుకు ఈ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మండల స్థాయిలో ఆడుతున్న వారికి ప్రభుత్వం క్రీడాకిట్లను అందజేస్తోందని, నియోజకవర్గ స్థాయి నుంచి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ వీరయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్, సర్పంచులు పలుకూరి మేరిరాణి, ఇత్తడి రమేష్, గంపల గంగాధర్, పలుకూరి శ్యామ్, మైనార్టీ సెల్ నాయకులు సుభాని, రేవేంద్రపాడు శ్రీను, జానీబాషా, పీఈటీలు, వలంటీర్లు, పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి..

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల ఎస్‌జీవీఆర్ హైస్కూల్‌లో గురువారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా మండల అభివృద్ధి అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని అధికారులు గుర్తించి వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కృషి చేయాలన్నారు. బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈఓపీఆర్డీ పి.రవికుమార్, పేరేచర్ల గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎస్.కె.రహమాన్, డోకిపర్రు పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, బాషా, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



పేరేచర్లలో ఖోఖో పోటీల విజేతలతో ఎంపీడీఓ ప్రభాకరరావు, అధికారులు

విద్య అసమానతలు లేని సమాజాన్ని నిర్మిస్తుంది

తాడేపల్లిరూరల్: విద్యమాత్రమే అసమానతలు లేని సమాజాన్ని నిర్మిస్తుందని నిర్మల జూనియర్ కళాశాల డైరెక్టర్ వి.వి.ప్రసాద్ అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని నిర్మల జూనియర్ కళాశాల వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎన్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.మధుబాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత భవిష్యత్తు కోసం, కలలు కనాలని, వాటిని సాధించడం కోసం పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో, క్రీడల్లో, 2023 ఇంటర్మీడియెట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. డాక్టర్ కేఎస్ఎస్ సాయి, కళాశాల అధ్యాపకులు జె.జ్యోతిపాల్, సీహెచ్ జనార్దన్, లక్ష్మీనారాయణ, జి.సజీవకుమారి, టి.ప్రకాష్, సీతారామయ్య, శోభన్‌బాబు, ప్రదీప్ శివరామకృష్ణ, విజయశాంతి, అమిత, సుబ్బారావు, వెంకట రమణ, రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు అందే రేవంత్, చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ వి.వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ వి.జవహర్, వీజేపీ డీఎల్‌బీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, శ్రీవిష్ణు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.మనోజ్ కుమార్, నిర్మల జూనియర్ కాలేజీ డైరెక్టర్ వి.శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ టి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు

మేడికొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ శాఖ అధికారులు గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. గుంటూరు విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీపీఈ కె.వి.ఎల్.ఎన్.మూర్తి, గుంటూరు–2 డివిజన్ ఆపరేషన్ ఈఈ సి.హెచ్.రమేష్‌ల ఆధ్వర్యంలో 18 మంది అధికారులు, 58 మంది సిబ్బంది 32 బృందాలుగా విడిపోయి డోకిపర్రు సెక్షన్, మండల పరిధిలోని పలు గ్రామాల్లో 2,173 సర్వీసులు తనిఖీ చేశారు. అక్రమంగా అదనపు లోడు వాడుతున్న వారిపై 56 కేసులు నమోదు చేసి, రూ. 3,25,500 అపరాధ రుసుము విధించారు. ఆకస్మిక తనిఖీల్లో సీఆర్‌డీఏ సూపరింటెండెంట్ టి.విజయకుమార్ పర్యవేక్షణలో జరిగింది. తనిఖీల్లో డోకిపర్రు ఏఈ నాగరాజు కుమార్, డివిజన్‌లోని డీఈలు, వివిధ మండలాల ఏఈలు పాల్గొన్నారు. విద్యుత్ చౌర్యం, సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడేవారిపై సెల్ 9440812260కు, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



సంప్రదాయ దుస్తుల్లో నిర్మల ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు



సంప్రదాయ దుస్తుల్లో వంశీ హైస్కూల్ ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భోగిమంటలు, రంగవల్లులు, గొబ్బెమ్మలతో పాఠశాలలో వేడుకలను నిర్వహించామని, విద్యార్థులు పండుగ వాతావరణంలో ఉల్లాసంగా, ఉత్సాహంగా సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారని తెలిపారు. హెచ్ఎం సిస్టర్ జ్ఞాన సుందరి మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం అందరి కర్తవ్యమని అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సిస్టర్ సామ్రాజ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వంశీ హైస్కూల్‌లో...

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి అమరావతి రోడ్డులో ఉన్న వంశీ హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలను సాంప్రదాయబద్ధంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల సమయంలో భోగిమంటలు, పిండివంటలు, కోలాటం నిర్వహించారు. స్వయంగా విద్యార్థులే ఉపాధ్యాయులతో కలసి సాంప్రదాయ దుస్తుల్లో పిండివంటలు చేశారు.

ఖురాన్ కంఠత క్వార్టర్ ఫైనల్ పోటీలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని అంజుమన్ కార్యాలయ ప్రాంగణంలో మంగళగిరి మండల స్థాయి ఖురాన్ కంఠత పోటీలు క్వార్టర్ ఫైనల్స్ రెండవ రౌండ్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నిర్వాహకులు సయ్యద్ రషీద్ మాట్లాడుతూ యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ సంస్థ ఆధ్వర్యంలో గత 8 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా విజయవాడ కేంద్రంగా ఖురాన్ కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ఈనెల 14వ తేదీ గుంటూరులో జరిగే జిల్లా క్వార్టర్ ఫైనల్స్‌కు పంపడం జరుగుతుందని అన్నారు. యుఎఫ్‌క్యూఎస్ డైరెక్టర్ దావూద్ మాట్లాడుతూ నేడు చెడున్నది చాలా సునాయాసంగా, అతివేగంగా ప్రబలిపోయి మానవ జీవితంలోని దాదాపు అన్ని రంగాల్లో తిష్ట వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖురాన్ కంఠత పోటీలు 3 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల బాలబాలికల కోసం నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహించే క్వార్టర్ ఫైనల్స్‌కు ఎన్నికైన 4 గ్రూపుల నుంచి 68 మందిని ఈ సంవత్సరం ఫిబ్రవరి 11వ తేదీ విజయవాడ నగరంలో జరిగే సెమీఫైనల్స్‌కు ఎంపిక చేయడం జరుగుతుందని, వాటిలో గెలుపొందిన 33 మంది ఫైనల్స్‌కు ఎంపికవుతారన్నారు. విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు నిర్ణయించామని తెలిపారు. జిల్లాస్థాయిలో క్వార్టర్ ఫైనల్ వరకు చేరుకున్న బాలబాలికలకు మెడల్స్, సర్టిఫికేట్లు, జానిమాజ్, ఖురాన్ గ్రంథాన్ని బహుమతిగా అందజేస్తామని తెలిపారు. ఏజేసీ పట్టణ కన్వీనర్ ఎండీ యూసఫ్, జమాతే ఇస్లామీ హింద్ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్, పట్టణ ఖాజీ అన్వర్, హాఫీజ్ ఆజ్ హర్ అంజామ్, దర్స్ గాహ్ స్కూల్ కార్యదర్శి అబ్దుల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.



ఖురాన్ కంఠత పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సీడ్ యాక్సిస్ రోడ్డుపై ప్రమాదం

- పలువురికి గాయాలు
- ఫోన్ చూస్తూ బుల్లెట్‌పై వెళుతూ ఆటో, స్కూటీలను ఢీకొన్న యువకుడు



ఘటనకు కారణమైన బుల్లెట్ వాహనం

తాడికొండ: రోడ్డుపై వేగంగా వెళుతున్న బుల్లెట్ ఎదురుగా వస్తున్న ఆటో, స్కూటీని ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన ఘటన తుళ్ళూరు మండలం వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డుపై జరిగింది. వివరాల ప్రకారం గురువారం ఉదయం సీడ్ యాక్సిస్ రోడ్డుపై తుళ్ళూరు నుంచి విజయవాడ వైపు బుల్లెట్‌పై వెళుతున్న ఓ యువకుడు ఫోన్‌లో చూసుకుంటూ ఎదురుగా వస్తున్న ఆటో, స్కూటీలను బలంగా ఢీకొట్టాడు. ఘటనలో ఆటోలో ఉన్న ప్రయాణీకులకు స్వల్ప గాయాలు కాగా స్కూటీపై వెళుతున్న మహిళకు కాలు విరిగింది. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు.

పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులకు గురువారం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు పొన్నెకంటి రమేష్ మాదిగ సౌజన్యంతో పండ్లు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, రమేష్‌మాదిగలు రోగులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది గ్రామంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల ప్రజలకు సిబ్బంది సహకారంతో మంచి వైద్యం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ పద్మశ్రీ, సూపర్‌వైజర్ ప్రసన్నలక్ష్మి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ ప్రేమసాగర్

తెనాలిటౌన్: పట్టణంలోని మారీసుపేట, గంగానమ్మపేటలోని ఎరువుల షాపులను గురువారం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు తోటకూర శ్రీనివాసరావు(గుంటూరు) వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్(తెనాలి)లు ఎరువుల షాపులను తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని షాపుల్లో ఎరువుల విక్రయాన్ని నిలిపివేశారు. షాపులోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి డీలరు షాపు వద్ద స్టాక్ బోర్డును ఏర్పాటు చేయాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సరైన ధ్రువపత్రాలు లేక కొన్ని షాపుల్లో రూ.13,29,480 విలువగల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశామని తెలిపారు.

పంటపొలాల్లో ఆస్ట్రేలియన్ విద్యార్థులు



తెనాలి: ప్రవాస భారతీయుడు, ఆస్ట్రేలియాలోని నోట్రెడేమ్ యూనివర్సిటీకి సిడ్నీలో గల స్కూల్ ఆఫ్ లా అండ్ బిజినెస్ ప్రొఫెసర్, డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ అత్తోట విద్యాసాగర్, అక్కడి విద్యార్థులు శీతాకాలం సెలవుల సందర్భంగా తెనాలి వచ్చారు. విద్యాసాగర్ ఇక్కడ నిర్వహిస్తున్న స్వచ్ఛంద పాఠశాల దయామణి జోసఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూలుకు, ఆయనతోపాటు పని చేసే ఉపాధ్యాయులు, విద్యార్థులు సెలవుల్లో ఇక్కడకు వస్తుంటారు. స్కూలు పిల్లలకు బోధనోపకరణాలు, ఆటపాటలతో పాఠాలను నేర్పుతారు. భారతీయ జీవన విధానం, పంటలను పరిశీలించి వెళుతుంటారు. ఆ క్రమంలో ఇటీవల తెనాలి వచ్చిన విద్యాసాగర్, ఆస్ట్రేలియా విద్యార్థులు టియార్నా బోనో, క్లోయీ పియర్సన్, లాచియన్ ఫ్లెమింగ్ గురువారం కొల్లిపరలోని శ్రేష్ట ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీని సందర్శించారు. కంపెనీలో కలెక్షన్ సెంటర్, పసుపు పొడి తయారీ, కోల్డ్ స్టోరేజిని పరిశీలించారు. వానపాముల ఎరువు, పంటపొలాల్లో భూమి ఆరోగ్యం తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన సెన్సార్లను చూసి, పనితీరును తెలుసుకున్నారు. కంపెనీ డైరెక్టర్, సేంద్రియ రైతు వుయ్యూరు సాంబిరెడ్డి వీరికి వివరాలను తెలియజేశారు.

మహాత్మా ఆశ్రమానికి రూ.లక్ష విరాళం

తెనాలి: పట్టణానికి చెందిన ప్రవాస భారతీయ నర్సు గంటెనపల్లి భాగ్యమ్మ స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని మహాత్మా సేవాశాంతి ఆశ్రమానికి రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం ఆమె ఆశ్రమాన్ని సందర్శించారు. మహాత్మా గాంధీ, కస్తూర్బా విగ్రహాలకు పూజలు చేశారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు స్వీట్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారికి రూ.లక్ష చెక్కును అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో అదే గ్రామానికి చెందిన తిప్పాబత్తిన రాజ్‌కుమార్ గుట్టుచప్పుడు కాకుండా తన ఇంట్లోనే అక్రమంగా మద్యం దాచి విక్రయిస్తున్నాడన్న సమాచారం సెబ్ ఎస్ఐ గీతకు అందింది. దీంతో ఆమె తన సిబ్బందితో కలిసి రాజ్‌కుమార్ ఇంటిపై దాడి చేసి తనిఖీలు చేశారు. మూటగట్టి ఉన్న తెల్లగోతంలో 20 విస్కీ బాటిల్స్ ఉండటాన్ని గుర్తించి బాటిల్స్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్టు

ఫిరంగిపురం: మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చల్లా కిషోర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములూరిపాడు గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక గుంటూరులోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. కాగా అదే గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడు ఓ మహిళ సహాయంతో బాలికను కిడ్నాప్‌చేసి ఒగదిలో బంధించి వివాహం చేసుకోవాలని హింసించినట్లు తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదుతో గురువారం పోలీసులు కేసు నమోదు చేసి బాలిక ఉన్న ప్రాంతాన్ని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. యువకుడిపై కేసునమోదుచేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 78మందికి వైద్యపరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా శ్వేత మాట్లాడుతూ శీతాకాలంలో వేడిగా ఉండే పదార్థాలు, నీరు తీసుకోవాలన్నారు. అంతేకాక దోమలు అధికంగా ఉంటాయని దోమతెరలు వాడటమే కాకుండా, జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో చూపించుకున్నట్లయితే మందులు అందజేస్తారని చెప్పారు. ఈకాలంలో డెంగీ, మలేరియా జ్వరాలు దోమకాటు వల్ల వస్తాయని, ఇంటిలోని పాత్రలు, తొట్లు, టైర్లు వంటి వాటిలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. హెచ్ఎస్ కె.సుదర్శన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆంథోనిరాణి, హెచ్ఏ బాబురావు, ఆశా కార్యకర్తలు సుజాత, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మలు పాల్గొన్నారు.